నకిరేకల్ : ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని సన్మానిస్తున్న పాఠశాల డైరెక్టర్ నర్సిరెడ్డి, కరస్పాండెంట్ యశ్వంత్‌రెడ్డి

క్రమశిక్షణే రేపటి భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, మార్చి 3 : విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, అది రేపటి భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ మినీ స్టేడియంలో శనివారం రాత్రి కృష్ణవేణి హైస్కూల్ వార్షికోత్సవాన్ని ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఇష్టపడి చదువుతూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు సమాజం పట్ల అవగాహన రావాలంటే వార్తా పత్రికలు, కథల పుస్తకాల లాంటివి నిరంతరం చదివేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. పాఠశాల డైరెక్టర్ నర్సిరెడ్డి మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరం నుంచి తమ పాఠశాలలో తల్లిదండ్రులు చనిపోయిన విద్యార్థులకు పదో తరగతి వరకు ఉచిత విద్య అందిస్తామని ప్రకటించారు. అంతకుముందు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా, మెమోంటోతో సత్కరించారు. అనంతరం విద్యార్థులు నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ గౌడ్, ఎంఈఓ మేక నాగయ్య, కరస్పాండెంట్ వి.యశ్వంత్‌రెడ్డి, ప్రిన్సిపల్ జోత్స్న, కౌన్సిలర్లు సుకన్య, స్వామి, శ్రీను,నాయకులు రాఘవరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, వలిశెట్టి స్వప్న పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

చిట్యాల : ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్నదని, నియోజకవర్గంలోని ప్రతి మైనార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాలలో సయీదా సయ్యద్ కుటుంబ ఆర్థిక సాయంతో రూ. 4.6 కోట్లతో పునర్నిర్మించిన మదీన మసీద్ పునః ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రార్థన వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, ఢిల్లీ మాజీ ఎంపీ మహ్మద్ మజాద్, ముఫ్తీ సిద్దిక్, మౌలానా ఎహ్‌సానొద్దీన్ ఖాస్మీ, హఫీజ్ పీర్ షబ్బీర్ అహ్మద్, అబ్దుల్ ముఫ్తీ, ఎస్‌కే ఇబ్రహీం, ముబిన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, కౌన్సిలర్లు బెల్లి సత్తయ్య, కోనేటి కృష్ణ, పోకల దేవదాసు, బట్టు అయిలేశ్, కాకులారపు బొర్రారెడ్డి, జహంగీర్, సయ్యద్ అన్వర్, ఎస్‌కే కరీం, జమీరుద్దీన్, దాయ్‌రా, నిస్సార్, ముబీన్, ముక్తదీర్, షకీర్, జిట్ట చంద్రకాంత్, దాసరి నర్సింహ, కల్లెం నర్సింహ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

పీఏపల్లి: కోదండపురంలో స్వామి వారి కల్యాణ మహోత్సవం

పెద్దఅడిశర్లపల్లి, మార్చి 3: మండలంలోని కోదండపురం వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్ల వాజామున గోదాదేవి పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ నాలుగు గంటల స్వామి కల్యాణ క్రతువు చేపట్టారు. ముందుగా ఎదుర్కోళ్లు నిర్వహించి స్వామి వారిని ఊరేగింపు కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. దాదాపు 1,050 జంటలు కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నాయి. సాయంత్రం, బలిహరణం నిర్వహించారు. సోమవారం స్వామి వారి రథోత్సవం చేపట్టనున్నట్లు తెలిపారు. మహోత్సవానికి తెలంగాణ , ఆంధ్ర నుంచి పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున్న హాజరయ్యారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శోభరాణి, ఆలయ కమిటీ చైర్మన్ గజ్జెల వెంకటేశ్వర్‌రెడ్డి, పురోహితులు శ్రీనివాసచార్యులు, కృష్ణామచార్యులు, శ్రీధర్ చార్యులు, శ్రీకాంతచార్యులు, రమణ చార్యులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ వాసికి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు

దైద రవి

సాహితి

చెరుకు వెంకన్న

విజయలక్ష్మి

మిర్యాలగూడ, మార్చి 3: మిర్యాలగూడ పట్టణం గాంధీనగర్‌కు చెందిన డాక్టర్ చెందిన డాక్టర్ దైద రవి ఇటీవల వెలువడిన ఉపాధ్యాయ ఫలితాల్లో మూడు ఉద్యోగాలు సాధించారు. నిరుపేద కుటుంబానికి చెందిన రవి 1 నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఇంటర్ నుంచి డిగ్రీ వరకు పట్టణంలోని నాగార్జున జూనియర్ కళాశాలలో, పీజీ ఇంగ్లిష్ హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో పూర్తి చేశారు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో గురుకుల జూనియర్ లెక్చరర్, పీజీటీ టీజీటీ ఇంగ్లిష్ పోస్టులకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ జూనియర్ లెక్చరర్ పోస్టులో జాయిన్ అవుతానని తెలిపారు. ఆయన భార్య సంధ్య ప్రస్తుతం హాలియాలోని బీసీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. రవికి కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

నేరటోనిగూడెం వాసికి రెండు ఉద్యోగాలు

మునుగోడు : మండలంలోని నేరటోనిగూడేనికి చెందిన సాహితీకి ఇటీవల వెలువడిన గురుకుల ఫలితాల్లో జూనియర్ లెక్చరర్ ఫిజిక్స్, టీజీటీ మాథ్స్‌లో ఎంపికైంది. గూడెం నుంచి మొదటి ప్రభుత్వం ఉద్యోగం సాంధించిన సాహితీని గ్రామస్తులు,బంధువులు అభినందనలు తెలిపారు.

చిట్యాల మండలంలో..

చిట్యాల : ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన గురుకుల ఫలితాల్లో మండలానికి చెందిన వారు ఒక్కొక్కరు రెండేసి ఉద్యోగాలు సంపాదించి తమ ప్రతిభను కనబరిచారు. పలువురు వారిని అభినందించారు . మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన చెరుకు వెంకన్న జూనియర్ లెక్చరర్‌గా, టీజీటీగా ఎంపికయ్యారు.

అలాగే గుండ్రాంపల్లికి చెందిన జిల్లా విజయలక్ష్మి గురుకుల జూనియ ర్ లెక్చరర్, టీజీటీ (సోషల్)లకు ఎంపికయ్యారు. ఉద్యోగం సంపాదించాలనే లక్ష్యం తో ఇంటి వద్దనే పట్టుదలతో చదివి రెండు ఉద్యోగాలు సంపాదించింది.

విజయలక్ష్మి రెండు ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల సీపీఐ నాయకులు బొడిగె సైదులు, జిల్లా సత్యం, అంజయ్య హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ

పతకాలు సాధించిన విద్యార్థులతో చిత్రకారుడు విజయ్‌కుమార్

మిర్యాలగూడటౌన్,మార్చి 3 :డ్రీమ్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో విజయవాడలో ఈ నెల 2న నిర్వహించిన 11వ ఆల్ ఇండియా యూత్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్ కాంపిటేషన్‌లో మిర్యాలగూడ పట్టణానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించినట్లు ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్ తెలిపారు. సబ్ జూనియర్స్ ,జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నాగనందిని, పి.ఆర్య, కె.మన్విత్తారెడ్డి, టి.అక్షయ వేసిన చిత్రాలకు బంగారు పతకాలు,శ్రీనిక్ సాయి, ఆరోహి ముఖర్జీ, డెబద్రి తగోష్, పి.ఆర్య,బి.ఉజ్వల వేసిన చిత్రాలకు వెండి పతకాలు లభించినట్లు ఆయన తెలిపారు.

విజేతలకు గుంటూరులోని వడ్డేశ్వరం, కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో అతిరథ మహారథుల సమక్షంలో పతకాలను అందజేశారని తెలిపారు.

చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలి

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నల్లగొండ మాన్యంచెల్కలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే బీఎల్‌ఆర్

నీలగిరి, మార్చి 3 : ఐదేండ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం అయన జిల్లా కేంద్రంలోని మాన్యంచెల్క అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పిల్లలు అంగవైకల్యం బారిన పడకుండా పిల్లలను రక్షించుకునేందుకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. అంతకుముందు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. కార్యక్రమాల్లో కలెక్టర్ దాసరి హరిచందన, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండల్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఇమ్యూనజేషన్ అధికారి డాక్టర్ జమీర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నిత్యానంద, ఎంసీహెచ్‌పీఓ డాక్టర్ అరుంధతి రెడ్డి పాల్గొన్నారు.

పోలియో నిర్మూలనకు కృషి చేయాలి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చిన్నారులకు ఆయన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేస రవి, అధికారులు వెంకయ్య, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

చిన్నారుల పోలియో చుక్కలు వేయించాలి

నకిరేకల్ : ఐదేండ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కల వేయించాలని ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. ఆదివారం నకిరేకల్ ప్రభుత్వాసుపత్రిలో ఎమ్మెల్యే వీరేశం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గాజుల సుకన్య, వైద్యాధికారి యోగస్వీ, హెచ్‌ఈఓలు రాపోలు రవి, వి. నర్సింహచారి తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ : ప్రభుత్వాసుపత్రిలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల: మున్సిపల్ కార్యాలయంలో పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్‌న కోమటిరెడ్డి చిన వెంకటరెడ్డి

నార్కట్‌పల్లి : పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి

గట్టుప్పల్ : చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న జడ్పీటీసీ వెంకటేశం

మునుగోడు : మండల కేంద్రంలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్

నిడమనూరులో చిన్నారికి పోలియో డ్రాప్స్ వేస్తున్న ఆశ కార్యకర్త

మాడ్గులపల్లిలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ శ్రీవిద్య

దేవరకొండ రూరల్ : మైనంపల్లిలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీటీసీ గౌతమీరాంసింగ్

ఆర్య సమాజ్‌లో ముగిసిన శతాబ్ది వేడుకలు

- పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఉత్సవాలకు హాజరైన ప్రజలు

నల్లగొండ రూరల్, మార్చి 3: నల్లగొండ ఆర్య సమాజ్‌లో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న శతాబ్ది ఉత్సవాలు అదివారం ముగిశాయి. ఈ చివరి రోజు జరిగిన వేడుకల్లో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడారు. దయానంద్ సరస్వతి సమాజానికి అందించిన ధర్మ సుత్రాలను ఆచరిస్తూ వందేండ్లగా నుంచి ఆర్య సమాజ్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తు భారత దేశంలోనే ఆగ్రగామిగా నిలిచిందన్నారు. ఆర్య సమాజ్ మందిరానికి వసతులు ,సౌకర్యలు కల్పనకు కృషి చేస్తానన్నారు. అలాగే గోశాలకు కావాల్సిన స్థలం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆర్య సమాజ్‌లో వివిధ రకాలుగా సేవలు అందించిన పలువురిని సత్కారించారు. మాజీ డీఎస్పీ నళిని, ఆర్యసమాజ్ మందిర్ రాష్ట్ర అధ్యక్షుడు విఠల్‌రావు, జిల్లా అధ్యక్షుడు బోయనపల్లి కృష్ణారెడ్డి, కార్యదర్శి గోపాల్‌రెడ్డి, లక్ష్మీనర్సింహారావు, కే.శంకర్, రవి ప్రసాద్, కోటయ్య, శక్తిందన్, దాసోజు నర్సింహాచార్యులు పాల్గొన్నారు.

ఎస్ఎల్‌బీసీ నీటితో చెరువులు నింపాలి

- పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి
- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

నకిరేకల్ : మంగళపల్లిలో వరిపంట చేనులను పరిశీలిస్తున్న రైతు సంఘం ప్రతినిధి బృందం

నకిరేకల్, మార్చి 3: వర్షాభావ పరిస్థితుల వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, ఎస్ఎల్‌బీసీ నీటితో జిల్లాలో చెరువులు, కుంటలు నింపాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నకిరేకల్ మండలం మంగళపల్లిలో ఆదివారం సీపీఎం జిల్లా రైతు సంఘం ప్రతినిధి బృందంతో పర్యటనకు వెళ్లి పంటపొలాలను పరిశీలించింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో 2 వేల ఎకరాల్లో వరి పంట వేయగా సుమారు 1500 ఎకరాల్లో పంట ఎండిపోయి రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గుడిపాటి అయిలయ్య అనే కౌలు రైతు 30 ఎకరాల్లో వరి సాగు చేస్తే 25 ఎకరాలు పూర్తిగా ఎండిపోయి పశువులను మేపుతున్న పరిస్థితులు కనబడుతున్నాయన్నారు. 11 బోర్లు వేసినా చుక్క నీరు రాలేదని రైతు తన గోడు వెల్లబోసుకున్నారన్నారు. ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో పంట పరిశీలన చేసి నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కందాల ప్రమీల, వెంకటేశ్వర్లు, శ్రీశైలం, హశం, వెంకట్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

చిట్యాల : వరాభావ పరిస్థితుల వల్ల పంటలు ఎండిపోయి నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదువకోవాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. మండలంలోని ఆరెగూడెంలో ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించిన వారు మాట్లాడారు. అధికారులు క్షేత్ర స్థాయిలో అంచనా వేసి ఎండి పొలాలకు ఎకరానికి రూ. 25 వేలు ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఐతరాజు నర్సింహ, అవిశెట్టి శంకరయ్య, అరూరి శ్రీను, లడే రాములు, సాపిడి ఆంజనేయులు, నరేశ్, లక్ష్మమ్మ, మోటె కిష్టమ్మ, శేఖర్ పాల్గొన్నారు.

చెర్వుగట్టులో రేషన్ దుకాణం ప్రారంభం

నార్కట్‌పల్లి,మార్చి 3: మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని తాసీల్దార్ ఎల్. వెంకటేశ్వర్ రావు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ తరుణ్, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పారుపల్లి నాగరాజు, ఉపేందర్, భిక్షమయ్య, సైదులు, రామదాసు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం ప్రారంభిస్తున్న తాసీల్దార్

జడ్పీటీసీ పాశం రాంరెడ్డి జన్మదిన వేడుకలు

తిప్పర్తి, మార్చి 3 :తిప్పర్తి జడ్పీటీసీ పాశం రాంరెడ్డి జన్మదినోత్సవం మండలంలోని మర్రిగూడ గ్రామంలో తన నివాసంలోఆదివారం నిర్వహించుకున్నారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

పేరూరు శివాలయం చైర్మన్‌గా కొండారెడ్డి

రిక్కల కొండారెడ్డి

హాలియా, మార్చి 3 : అనుముల మండలం పేరూరు స్వయంభూసోమేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా మండలంలోని మదారిగూడెం గ్రామానికి చెందిన రిక్కల కొండారెడ్డి నియమితులయ్యారు. ధర్మకర్తలుగా చెన్నబోయిన శ్రీనయ్య, దుండిగల్ల పెద నర్సింహ,యడవల్లి సునీత, జానపాటి వెంకన్న, సైదాచారి,ఆంగోతు పాండునాయక్ నియమిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ అనిల్ కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కొండారెడ్డి, ధర్మకర్తలు సోమవారం సోమేశ్వర స్వామి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టనున్నారు.

6 నుంచి వాడపల్లిలో శివరాత్రి ఉత్సవాలు

దామరచర్ల, మార్చి 3: మండలంలోని వాడపల్లి మీనాక్షీ అగస్త్యేశ్వరస్వామి, లక్ష్మీనర్సింహస్వామి ఆలయాల్లో ఈనెల 6 నుంచి 11వ వరకు శివరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సిద్దయ్య తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 8న మహాశివరాత్రి పర్వదినం ఔపాసన, బలిహరణ, రుద్రాభిషేకాలు రాత్రి 11 గంటలకు ఎదుర్కోళ్లు, స్వామివారి కల్యాణం, లింగోద్భవ అభిషేకం, నందివాహన సేవ, 11న పల్లకీసేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మాల్, మార్చి 3 : చింతపల్లి మండల కేంద్రం లోని సాయిబాబా ఆలయంలో ఆదివారం కేర్ అండ్ కేర్,ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివార ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు సుమారు 500 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలను అందించారు. షుగర్,బీపీ పరీక్ష చేసి కాటరాక్ట్ ఉన్న వారికి 17న ఉచిత ఆపరేషన్లు చేయిస్తామని కేర్ అండ్ కేర్ ఐ హాస్పిటల్ ఫౌండర్ ప్రసాద్ తెలిపారు.

ట్యాంకర్‌ను ఢీకొని యువకుడి మృతి

కట్టంగూర్, మార్చి 3 : మండలంలోని అయిటిపాములలో ఆదివారం ట్యాంకర్ ఢీకొని యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సున్నపు రాజశేఖర్(23) నకిరేకల్ నుంచి బైక్‌పై అయిటిపాములకు బయల్దేరాడు. చెర్వుఅన్నారం స్టేజీ వద్దకు రాగానే విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టి బోల్తా పడింది. ప్రమాదంతో రాజశేఖర్ అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుతున్నట్లు ఎస్ఐ శ్రీను తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుడు పద్మారెడ్డికి నివాళి

పద్మన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

కట్టంగూర్, మార్చి 3: మండలంలోని పందెనపల్లి గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు గోదల పద్మారెడ్డి (పద్మన్న) 32వ వర్ధంతిని గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పద్మారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం చిన్నారులు, వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోదల కృష్ణారెడ్డి, గోదల యాదవ రెడ్డి, గజ్జి హనుమంతు, గద్దపాటి యాదయ్య, అక్కెనపల్లి యాదయ్య, కల్యాకారి భిక్షం రెడ్డి, వరమ్మ పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ గ్రేటర్ ఆధ్వర్యంలో అన్నదానం

మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో అన్నదానం చేస్తున్న వాసవీక్లబ్ గ్రేటర్ మిర్యాలగూడ సభ్యులు

మిర్యాలగూడ టౌన్,మార్చి 3 : వాసవీ క్లబ్‌గ్రేటర్ మిర్యాలగూడ ఆధ్వర్యంలో పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం అన్నదానం, మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ ప్రెసిడెంట్, సెక్రటరీ రేపాల శ్రీనివాస్, గుండా మల్లయ్య మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ఏదో ఒక సందర్భాన్ని పురస్కరించుకొని సేవాకార్యక్రమాలను నిర్వహించడం చాలా సంతృప్తి నిస్తుందని అన్నారు. గోళ్ల మురళి, సునీత పెళ్లి రోజు సందర్భంగా అన్నదానం నిర్వహించినందుకు వారిని అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి గోసుగుంట్ల జనార్దన్, ఐపీసీ మిరియాల శత్రయ్య, ఆర్టీసీ డీఎం పాల్, పీసీ జయలక్ష్మి, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ లకుమారపు పాండురంగయ్య, ఐపీసీ విద్యాసాగర్, ఆర్ఎస్ నీలాఆనంద్, వైస్ ప్రెసిడెంట్ మంచుకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వారం రోజుల్లో పెళ్లి.. అనుమానాస్పద స్థితి యువతి మృతి

యమున(ఫైల్)

కట్టంగూర్, మార్చి 3 : అనుమానాస్పద స్థితిలో యువతి ఉరేసుకుని మృతి చెందింది. ఘటన మండలంలోని అయిటిపాముల గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన దేవరాపల్లి యమున(30) అయిటి పాముల సబ్ పోస్టాఫీసులో బ్రాంచ్ పోస్టు మాస్టర్‌గా(బీపీఎం)గా విధులు నిర్వర్తిస్తుంది. కిరాయి ఇంటిలో ఉన్న యమున ఉదయం నుంచి బయటకు రాకపోవడంతో చుట్టు పక్కల వారు, గ్రామస్తులు నల్లగొండలో ఉన్న ఆమె బంధువులకు సమాచారం అందించారు. వారు వచ్చి తలుపు తెరిచి చూడగా చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతి చెంది ఉంది. తన చెల్లె మృతిపై అనుమానం ఉందని మృతురాలి అన్న దుర్గాప్రసాద్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీను తెలిపారు. యమునకు పెళ్లి సంబంధం కుదరడంతో ఈ నెల 10న వివాహం జరగనుండడంతో ఆ ఇంట్లో విషాదం నెలకొంది.

కల్లు గీత కార్మిక సంఘం గ్రామశాఖ కార్యవర్గాలు

గుర్రంపోడ్, మార్చి 3: కల్లుగీత కార్మిక సంఘం గుర్రంపోడు, మొసంగి గ్రామశాఖ కార్యవర్గాలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి దశరథ అధ్యక్షతన ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో కార్యవర్గాలను ఎన్నుకున్నారు. గుర్రంపోడ్ అధ్యక్షుడిగా రావుల సైదులు గౌడ్(పుల్లయ్య)ఉపాధ్యక్షుడిగా వడ్డెగోని సైదులు గౌడ్,ప్రధాన కార్యదర్శిగా వడ్డెగోని రాంబాబు గౌడ్, సభ్యులుగా రావుల శంకరయ్య, చామకూరి సత్తయ్య, సూర్య నర్సింహ,చలమల్ల మనోహర్, రావుల యాదమ్మ, మురాంతకలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొసంగి గ్రామ శాఖ అధ్యక్షుడిగా అయితగోని లింగయ్య, ఉపాధ్యక్షుడిగా అయితగోని రాములు, ప్రధాన కార్యదర్శిగా జెర్రిపోతుల శివకుమార్‌ను ఎన్నుకున్నారు.

షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

నార్కట్‌పల్లి మార్చి 3: మండలకేంద్రంలోని 12వ వార్డులో రూ. 3 లక్షలతో ముత్యాలమ్మ ఆలయ షెడ్డు నిర్మాణానికి ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్ రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు పుల్లెంల ముత్తయ్య, పాశం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.